క్లుప్తంగా

జూదరుల అరెస్టు

కొల్లిపర: మండల పరిధిలోని చివలూరులో శనివారం పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.4200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు తాతారావు, నాగబాబు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి



తెనాలి టౌన్: ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని పెనుగొండ పీఠాధిపతి బాలస్వామీజీ పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో శనివారం పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఆయన్ను కలిసి ఆశీస్సులు పొందారు. పెనుగొండ పీఠాధిపతిగా ఈ నెల 8న బాలస్వామీజీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ విద్యా నిధి కమిటీ, శ్రీవాసవీ సేవా సమితి, కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పెండేల వెంకట్రావు, పెండేల సుబ్బారావు, సాయి రమేష్, యక్కల శ్రీమన్నారాయణ, మేడా బదరీనారాయణ, సుగ్గల వెంకటప్పయ్య, గుప్తా, తాతా శ్రీనివాసరావు, సుధాకర్, శేషగిరి, చీమకుర్తి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించేందుకు ఎక్స్‌పో దోహదం



తెనాలి అర్బన్: మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఎక్స్‌పో దోహదపడుతుందని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసు రోడ్డులోని స్కూలులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అకాడమిక్ ఎక్స్‌పో శనివారంతో ముగిసింది. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న వివిధ అంశాలకు సంబంధించిన నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. సందర్శకులకు వాటి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల ఏర్పాటు



తెనాలి రూరల్: రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ బి. జనార్దనరావు తెలిపారు. పట్టణ మార్కెట్ కూడలి వద్ద త్వరలో 35 బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. బారికేడ్లను పట్టణానికి చెందిన కొత్తమాసు తులసీదాసు, నటరాజ్ జ్యుయలరీ మార్ట్ అధినేత కొత్తమాసు కుమార్ పోలీసు శాఖకు అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అవి ఏర్పాటు చేసే ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను డీఎస్పీ శనివారం రాత్రి పరిశీలించారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు అధికారులతో కలసి ఆయన బారికేడ్లు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు.

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలి

మంగళగిరి టౌన్: చేతి వృత్తుల పరిరక్షణకు, వృత్తిదారుల సంక్షేమానికి కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలాజీ మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను చేతి వృత్తులను ప్రోత్సహించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఆయా వృత్తుల్లో ఆధునిక యంత్రాలు రావడం, కార్పొరేట్ సంస్థలకు పాలక ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు రాయితీల రూపంలో అందిస్తుంటే వృత్తిదారులు కార్పొరేట్లతో పోటీ పడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఈనెల 24న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో చేతివృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగాంజనేయులు, గీత పనివార్ల సంఘం నాయకుడు కంచర్ల కాశయ్య, మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కోటప్పకొండ’ క్షేత్రంపై చిత్రం

దర్శకులుగా తెనాలి యువకులు



నరేష్ దోనె



మణివరన్



‘కోటప్పకొండ’ చిత్రంలో శివుడిగా నరసింహరాజు

తెనాలి: తెలుగువారి పండుగల్లో మహాశివరాత్రి ఒకటి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ శైవక్షేత్రం విశిష్టమైనది. చారిత్రక ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవ వేడుకలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని తెలిసిందే. పలు గ్రామాల నుంచి తరలివచ్చే విద్యుత్ ప్రభలు ఈ ఉత్సవాల్లో పెద్ద ఆకర్షణ. ఇలాంటి ప్రఖ్యాత శైవక్షేత్రం స్థలపురాణ చరిత్రను ‘కోటప్పకొండ’ పేరుతో తెరకెక్కించారు తెనాలికి చెందిన యువదర్శకులు. మహాశివరాత్రి పర్వదినమైన 26న ప్రముఖ శాటిలైట్ టీవీలో రెండు పర్యాయాలు ప్రసారం కానుంది.

ఓటీటీలో.. హిందీలోనూ ప్రసారం

తెనాలికి చెందిన నరేష్ దోనె, మణివరన్ అలియాస్ మణికుమార్ చింతాలు కోటప్పకొండ స్థలపురాణాన్ని దృశ్యరూపం కల్పించారు. వృత్తిరీత్యా పెయింటర్ అయిన నరేష్ దోనె, కొంతకాలం పాత్రికేయుడిగా పనిచేసిన మణివరన్ ఈ చిత్రంతో దర్శకులయ్యారు. సినిమాలంటే ఆసక్తి కలిగిన వీరి



మౌనికరెడ్డి, బస్టాప్ కోటేశ్వరరావు

ద్దరు సినీదర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా దగ్గర సహాయకులుగా చేస్తున్నారు. ఆయన దగ్గరే మెలకువలు నేర్చుకుని తొలి ప్రయత్నంగా ‘కోటప్పకొండ’కు కథను సిద్ధం చేసుకుని మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను చేపట్టారు. దిలీప్‌రాజా నిర్మాతగా వ్యవహరించారు. ఒకప్పటి ప్రముఖ జానపద చిత్రాల హీరో నరసింహరాజు శివుడుగా నటించగా, బస్టాప్ కోటేశ్వరరావు, మౌనికరెడ్డి, ఎర్రబాబు, సునీత, స్వాతి, సత్యదేవ్‌స్వామి, ఈదర అమర్‌నాథ్, తహసీన్‌లు ఇతర పాత్రల్లో నటించారు. అందరి సహకారంతో అతి తక్కువకాలంలోనే ఈ మినీమూవీని తీయగలిగామని, సంతృప్తిగా వచ్చిందని నరేష్ దోనే చెప్పారు. భక్తజన కోటికి మహాశివరాత్రి కానుకగా అందిస్తున్నట్లు చెప్పారు.

నిజాయతీకి మారుపేరు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

తెనాలి టౌన్: నిజాయతీ, నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె తెనాలి వచ్చారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు కార్మికుల సమసల్యపై మండలిలో గళం విప్పిన ఘనత పీడీఎఫ్ ఎమ్మెల్సీలదేనని వెల్లడించారు. ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావుకు పట్టభద్రులంతా ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాల ఉద్యమ నేపథ్యం కలిగిన లక్ష్మణరావు బహుముఖ ప్రజ్ఞశాలిగా కొనియాడారు. నాగార్జున విశ్వ విద్యాలయం, కొల్లిపర పంచాయతీ సిబ్బందికి పీఎఫ్ అమలు వంటి సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించినట్లు గుర్తు చేశారు. ఉన్నత వ్యక్తిత్వం, సమస్యలపై పోరాట పటిమ కలిగిన లక్ష్మణరావు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. సమావేశంలో కె.బాబుప్రసాద్, భావన్నారాయణ పాల్గొన్నారు.

జ్యూయలరీ షాపులో చోరీకి విఫలయత్నం

తెనాలి రూరల్: పట్టణ షరాఫ్ బజార్‌లోని ఓ జ్యూయలరీ షాపులో ఓ దొంగ చోరీకి విఫలయత్నం చేశాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక షట్టర్ తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించగా సాధ్య పడలేదు. నిందితుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ నాజరుపేట వాసిగా సమాచారం.

వార్డు సచివాలయం తనిఖీ



తెనాలి రూరల్: పట్టణ ఐతానగర్‌లోని 1వ వార్డు సచివాలయాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని వాటికి పట్టా ఇవ్వొచ్చని గత నెల 29న రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 30 విడుదల చేసింది. స్థానిక ఒకటో వార్డులోని వైఎస్ఆర్ కాలనీలో పేదలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని ఉంటున్నారు. ఇటీవల మంత్రి మనోహర్ పర్యటనకు వచ్చిన సందర్భంలోనూ తమకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వీటికి దరఖాస్తు చేస్తున్న విధానాన్ని తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. ఒక దరఖాస్తును ఆయన ఆన్‌లైన్ చేయించారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించారు. అర్జీలు, వాటి పరిష్కారం గురించి సిబ్బందిని ప్రశ్నించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

హామీలు అటకెక్కించిన కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులుతో ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంటు, నూతన పింఛన్లు వంటి పలు పథకాలను ప్రభుత్వం అటకెక్కించారని చెప్పారు. రాష్ట్రంలో పేద, సామాన్య కుటుంబాలకు చెందిన వారు పథకాలు అందక పలు కష్టాలు పడుతున్నారన్నారు. పేదల కష్టాలకు ఫలితం దక్కాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతి చోట పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందని తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో తాను తోడుగా ఉంటానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

శివరాత్రికి సిద్ధమవుతున్న సంగమేశ్వరుడు

- అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటి
- వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- విశేషంగా రథోత్సవం



నూతన శోభ సంతరించుకున్న ఆలయం



సిద్ధమవుతున్న రథాలు, ప్రభలు



ఆలయ అంతర్భాగం

తెనాలి రూరల్: మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి సిద్ధమవుతున్నాడు. దేవస్థానాన్ని ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ అధికారులు, ఆలయ చైర్మన్ ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి సన్నిధిలో ఈ నెల 23వ తేదీ ఆదివారం నుంచి మార్చి 1వ తేదీ శనివారం వరకూ పాంచాహ్నిక దీక్ష పూర్వకంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి వి. పద్మ, గూడూరి గోపీకృష్ణ శర్మ, సంగారపు వెంకట రమణ, ప్రత్తిపాటి కాశీ ప్రసాద్, ప్రత్తిపాటి నందీశ్వర దీక్షితులు, సంగారపు శశిధర్, ఆలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

- 23న స్వామి వారిని పెండ్లి కుమారుని చేయడం, బిందె తీర్థాన్ని గ్రామంలో ఊరేగించి, అగ్ని ప్రతిష్టాపన, అంకురారోపణ, ధ్వజారోహణం చేస్తారు.
- 24న గ్రామ బలిహరణ నిర్వహించి, స్వామిని శేష వాహనంపై ఊరేగిస్తారు.
- 25న నరనంది వాహనంపై ఊరేగించి. గ్రామ ప్రభను రథం పైకి చేర్చుతారు.
- 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయం లోపల బలిహరణ, స్వామివారికి లింగోద్భవకాల అభిషేకం ప్రారంభిస్తారు. గ్రామం నుంచి భక్తులు ఇచ్చే తలంబ్రాలను ఆలయానికి తీసుకువెళతారు. మధ్యాహ్నం ఎదురుకోలు నిర్వహించి, రాత్రికి సంగమేశ్వర, పాపవినాశేశ్వర, వీరభద్రస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తారు.
- 27న ఉదయం స్వామి వార్ల గ్రామోత్సవం, సాయంత్రం రథోత్సవం ఉంటాయి.
- 28న ఉదయం వసంతోత్సవం, స్వామి వార్ల గ్రామోత్సవం త్రిశూల స్నానం, పూర్ణాహుతి, అశ్వ వాహనంపై ఊరేగిస్తారు.
- మార్చి 1న మధ్యాహ్నం వరకు అభిషేకాలు నిర్వహించి, రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ నిర్వహిస్తారు.

పురాతన ఆలయాల్లో ఒకటి

సంగమేశ్వరస్వామి దేవస్థానం పురాతన ఆలయాల్లో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. ద్వాపర యుగాంతంలో అత్రి మహా ముని ప్రతిష్ఠించాడని చెబుతుంటారు. సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పాపవినాశేశ్వర, వీరభద్రస్వామి, ఆంజనేయ, గంగాదేవి, శ్రీబాలాత్రిపురసుందరిసమేత సంగేశ్వరస్వామి దేవస్థానం, నవగ్రహ మండపం ఉన్నాయి. వందల ఏళ్ల కిందట ప్రతిష్ఠించిన ఆలయంలో కోరిన కోర్కెలు నెరవేరతాన్న విశ్వాసం భక్తుల్లో ఉంది. 187 ఏళ్ల కిందట రాచూరు జమీందార్లు ఆలయంలో అన్నశాలను నిర్మించడంతో పాటు అర్చకుల, ఇతర సేవకులకు ఈనాములు ఇచ్చారు. వీరి వంశస్థులే ఆలయ చైర్మన్‌లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రావుబహదూర్ మాణిక్యరావు సిద్ధార్థ వెంకట మార్కండేయరావు చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే కాశీ, గయ, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నంత పుణ్యప్రదమన్న నమ్మకం భక్తుల్లో ఉంది.

విశేషంగా రథోత్సవం

రథోత్సవాన్ని ఏటా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన గ్రామస్థులు ఈ వేడుకల్లో పాల్గొనడం విశేషం. రథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల్లోని భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారు. శివరాత్రి పండుగ నాడు రథాన్ని ఆలయానికి తీసుకువస్తారు. ఆ మరుసటి రోజు ప్రభలపై స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించి, సాయంత్రానికి రథోత్సవం నిర్వహిస్తారు.

నాజర్ జీవితం కళాకారులకు ఆదర్శం



పొన్నెకల్లు(తాడికొండ): తన ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన నాజర్ మరణించినా ప్రజల గుండెల్లో అమరుడిగా నిలిచిపోయారని దూదేకుల సంఘం నాయకులు డి.నాగూర్ వలి, ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. పొన్నెకల్లులో జన్మించి బుర్రకథ పితామహుడిగా ఎదిగి పద్మశ్రీ అవార్డు పొందిన నాజర్ జీవితం కళాకారులకు, సామాన్యులకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. దూదేకుల సంఘం నాయకులు షేక్ సర్దార్, షేక్ షరీఫ్, రేపూడి శ్రీనివాసరావు, షేక్ ఆదాం సాహెబ్, శాఖమూరి సాంబశివరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఉమ

తెనాలి అర్బన్: విద్యలో ప్రతి ఒక్కరూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ సూచించారు. గుమ్మడి విజయలక్ష్మి స్మారక నగదు ప్రోత్సాహక బహుమతులను శనివారం ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం స్కూల్‌లో పంపిణీ చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న పి.జయశ్రీ , అక్షయ గ్లోరికి రూ.10వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఉమ మాట్లాడుతూ విద్యపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సునీత, ప్రసాద్, శారద, సంపూర్ణ, బెల్లంకొండ వెంకట్, మనోజ్, ప్రసూనాదేవి, వెంకటరమణ, నీలిమ, ప్రశాంతి పాల్గొన్నారు.

దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి టౌన్: జనాభా దామాషా ప్రకారం బీసీ కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లు ఏడాదికి రూ. 30వేల కోట్ల వంతున ఐదేళ్లలో రూ. 1.5లక్షల కోట్లను బడ్జెట్‌లో బీసీ మంత్రిత్వశాఖకు కేటాయించాలని కోరారు. బీసీల స్వయం ఉపాధికి పదివేల కోట్లు, వృత్తిదారులకు సంబంధించి ఆదరణ -3 పథకానికి రూ.5వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యాదవులు, కురుబలకు రాయితీతో గొర్రెల యూనిట్‌లను బీమా సౌకర్యంతో అందించాలని కోరారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ లేకుండా పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు 25వేల గౌరవ వేతనంతో పాటు, షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. వడ్డెరలకు క్వారీలో 20శాతం రిజర్వేషన్‌లతో రాయల్టీగా సీనరీ చార్జీలో మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపులో 10శాతం రిజర్వేన్ అమలు చేయడం అభినందనీయమని తెలిపారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి



శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈవో జయంతిబాబు

తెనాలిటౌన్: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించాలని ఎంఈవో పి.జయంతిబాబు సూచించారు. సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్టీ, ప్రథమ్ వారి సమన్వయంతో జ్ఞాన జ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ ఫైనల్ కోర్సు, సెకండ్ స్పెల్ శిక్షణ శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక మారీసుపేటలోని ఎస్‌సీఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణలో ఎంఈవో జయంతిబాబు పాల్గొని అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు. నిర్మాణాత్మక ఆటలు, మేధస్సు, భాష పెంపొందేందుకు చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందించాలని ఆయన స్పష్టం చేశారు. పిల్లల ప్రత్యేక సామర్థ్యాలు, అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. రంగులు, ఆకారాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో డాక్టర్ కె.సునీత, డీఆర్‌పీలు రామరాజు, కె.సౌజన్య, సీఆర్ఎంపీలు శ్రీదేవి, గీతాంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానివన్నీ కల్లబొల్లి మాటలే!

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



వహబ్ రోడ్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి టౌన్: అధికారంలోకి వస్తే హామీలన్ని అమలు చేస్తామని కల్లబొల్లి మాటలతో కూటమి అధికారం చేపట్టిందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని వహాబ్ రోడ్డులో శనివారం ఆయన రైతు సంఘం నేతలతో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడైన కె.ఎస్. లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకు మేనిఫెస్టోలో పొందుపరచిన ఒక హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంకీర్తనల గానం



సంకీర్తనల గానంలో పాల్గొన్న భక్తులు

తెనాలి టౌన్: ప్రజల్లో భక్తి భావం పెంపొందేందుకు సంకీర్తన గానం దోహదపడుతుందని శ్రీ హరి నామా సంకీర్తన బృందం నిర్వాహకులు పెరవలి వంశీకృష్ణ తెలియజేశారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీ రుక్మిణీ సమేత గోవర్ధనస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం శ్రీ హరి నామా సంకీర్తన బృందం సంకీర్తనలు ఆలపించింది. హిందూ ధర్మ ప్రచారపరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి వారం దేవాలయాల్లో సంకీర్తన గానం నిర్వహిస్తున్నట్లు వంశీకృష్ణ తెలియజేశారు. ప్రజల్లో భక్తి భావం, ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసేందుకు ధార్మిక చింతనతో కూడిన సేవలు సమాజానికి అవసరమని ఆయన తెలిపారు. సంకీర్తన గానంలో అందె బాలచంద్రమౌళి, ఎం.నాగఅర్చన, రూపశ్రీ, దుర్గామల్లేశ్వరి, పూజిత, శ్రావణి, ఝాన్సీ, టి.వి.ఎస్. శాస్త్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు టి.రఘు, భక్తులు పాల్గొన్నారు.

డొంక రోడ్డులో యువకులు హల్‌చల్

ప్రశ్నించిన రైతులపై రాళ్లతో దాడి



గాయపడిన రైతు వేణుగోపాల రెడ్డి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని అమరావతి రోడ్డులో దేవుడి మాన్యం సమీపంలో పంట పొలాల్లో ఉన్న డొంక రోడ్డులో అతి వేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న యువకులను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఇద్దరు యువకుల్లో ఒకడు విచక్షణారహితంగా రైతులపై దాడి చేశాడు. వేణుగోపాలరెడ్డి అనే రైతుకు నుదిటిపై గాయమైంది. చుట్టుపక్కల రైతులు పరిగెత్తుకు రావడంతో డొంక రోడ్డులో వెళ్లే మార్గం లేక రెండు ద్విచక్ర వాహనాలను, ఒక సెల్ ఫోన్‌ను వదిలేసి యువకులు పరారయ్యారు. దీనిపై ఆ ప్రాంత రైతులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. డొంక రోడ్డులో నిత్యం మద్యం, గంజాయి తాగిన ఆకతాయిలు సీసాలు పగలకొట్టి పొలాల్లో విసిరి వేస్తున్నారని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాము వెంట పడడంతో రాళ్లు విసిరారని తెలిపారు. ఆ యువకులపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి

తాడేపల్లిరూరల్: తమకు అప్పగించిన పదవులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన సయ్యద్ గౌస్ మొహిద్దీన్ శనివారం పలువురు పార్టీ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.